

ఘనంగా నన్నయ జయంతి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనం వద్ద వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, డి. సుబ్రహ్మణ్యం, రాఘవరావు నన్నయ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నన్నయ విగ్రహం వద్ద బోట్ క్లబ్ సభ్యుల నివాళి

ధాన్యం సేకరణపై అప్రమత్తం



ఐఎంఎల్ డిపో వద్ద బిక్షటన చేస్తున్న హమాలీ వర్కర్లు

కూలి రేట్లు పెంచాలంటూ

హమాలీల భిక్షాటన

ప్రజాశక్తి - సామర్లకోట

పెరిగిన నిత్యవసరదారులకు అనుగుణంగా హమాలీల కూలి రేట్లు పెంచాలని బేవరేజెస్ హమాలీ వర్కర్స్ మంగళవారం స్థానిక ఏపీ ఎస్ బి సి ఎల్ ఐ ఎం ఎస్ ఎల్ డిపో ఎదుట బిక్షటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ .వి.వి. సత్యనారాయణ ఎన్.వి.అప్పారావు లు మాట్లాడుతు ఏళ్ల తరబడి రాష్ట్రంలోని ఎగుమతి దిగుమతి పనులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరుస్తున్న హమాలీలకు కనీస సౌకర్యాలను కల్పించకుండా వ్యవహరించడం దారుణమని అన్నారు. 2021 డిసెంబర్లో కూలి రేట్లు పెంపు ఒప్పందం కుదిరిందని కానీ నేటికీ దాని అమలు చేయడం లేదన్నారు. దీనికి తోడు రోజురోజుకు పెరిగే, పెట్రోల్ నిత్యవసర ధరలు పెరుగుదలతో హమాలీలు బతుకులు మరింత కష్టతరంగా తయారయ్యాయని అన్నారు. హమాలీలకు ప్రభుత్వం కనీసం ఉద్యోగ భద్రత కూడా కల్పించడం లేదన్నారు. పనులలో గాయాల పాలవుతున్న కార్మికులతకు వైద్య ఖర్చులు కూడా లేవని తక్షణం హమాలీలు అందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్లలను అమలు చేయాలని అన్నారు. డిపోలు వర్షాలకు తట్టు కునే విధంగా తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. పై సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నేల 14 తేదీ లోపు స్పందించకుంటే 15వ తేదీ నుండి నిరవధిక సమ్మెను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, హమాలీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బి ఆదినారాయణ, వి.అప్పలరాజు, ఎన్. తిరుమలరావు, జి.గోవింద్, ఎ సోమేశ్, పి.సత్తిబాబు, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్ పక్కనే వదిలేసిన పూడిక

పూడిక తీసి వదిలేశారు...

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మంగళవారపుపేట సెంటర్ నుండి చల్లా వారి రామాలయం వరకు మురుగు నీటి ప్రవాహ డ్రెయిన్‌లో పూడిక తీసి మట్టిని గుట్టలుగా వదిలేశారు. ఐదు రోజులు నుంచి ఈనాటికీ ఆ మట్టిని తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ రహదారిలో వెళ్లేవారు వీధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. కుక్కలు, పందులు వీటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ మట్టిని వెంటనే తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలు ఎప్పుడు?

ప్రారంభమైన ఖరీఫ్ కోతలు

పూర్తి కాని సిఎంఆర్ ట్యాగింగ్ ప్రక్రియ



ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఇంకా ప్రారంభం కాలేదు. ఏ తేదీ నుండి ప్రారంభమవుతుందనే దానిపై స్పష్టత లేదు. కాకినాడ జిల్లాలో గండేపల్లి, జగ్గంపేట, పెదపూడి, కిర్లంపూడి, ఏలేశ్వరం, కోటనందూరు తదితర మండలాల్లో వరి కోతలు ఇప్పటికే మొదలయ్యాయి. కొన్నిచోట్ల కోతలు పూర్తయ్యాయి కూడా. మరో వారం పది రోజుల్లో దాదాపు జిల్లా అంతటా పూర్తి స్థాయిలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. గండేపల్లి మండలంలో రెండు వారాల క్రితమే కోతలు మొదలవగా 40 శాతం పూర్తయ్యాయి. మరో నాలుగైదు రోజుల్లో ఈ మండలంలో వరి కోతలు మొత్తం పూర్తి కానున్నాయి. ఎ-గ్రేడ్‌కు రూ.2,060, సాధారణ రకం రూ.2,040 చొప్పున మద్దతు ధర చెల్లించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాల్సి ఉంది. కొనుగోళ్లు ఇంకా ఎక్కడా ప్రారంభం కాకపోవడంతో ఈ మండలంలో పలువురు రైతులు 75 కేజీలు బస్తాను రూ.1,400కే అమ్ముకోవాల్సి వస్తోంది. మద్దతు ధర ప్రకారం 75 కేజీలకు రూ.1,545 రావాలి. బస్తా వద్ద రైతులు రూ.145 వరకూ నష్టపోతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనందున తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం సేకరణపై స్పష్టత కరువు

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రశ్నార్థకంగా మారింది. నవంబరు మొదటి వారం నుంచే సేకరణ చేయాలని అధికారులు తొలుత భావించారు. కాని అమల్లోకి రాలేదు. రెండు లేదా మూడో వారం నుంచి సేకరించేందుకు సమాయత్తమవుతున్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో కీలకమైన కస్టమ్ రైస్ మిల్లింగ్ (సిఎంఆర్)కు నిర్దేశించిన రైస్ మిల్లులు బ్యాంకు గ్యారంటీలు నేటికీ సమర్పించలేదు. వాస్తవానికి ఈ ప్రక్రియను ముందుగానే పూర్తి చేసి ఆర్‌బికెలకు ఆయా రైస్ మిల్లులను ట్యాగింగ్ చేయాలి. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందనే దానిపై స్పష్టత లేదు.

మిల్లర్లకు బకాయిలు

జిల్లాలోని రైస్ మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.425 కోట్లు బకాయి ఉంది. అవి ఎప్పుడు ఇస్తుందో సర్కారు స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వలేమని, ధాన్యం రవాణా ఖర్చులు, మిల్లింగ్ ఛార్జీలు, గోనె సంచుల డబ్బులు ఇవ్వాలని మిల్లర్లు అడుగుతున్నారు. ఒక మిల్లుకు ఎంత ధాన్యం ఇస్తున్నారో దాని ఖరీదుకు సరిపడా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీని ప్రకారం 1:1 నిష్పత్తిలో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వలేమని మిల్లర్లు తేల్చి చెబుతున్నారు. ఈ సమస్యల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు.

సేకరణ లక్ష్యం 46.3 శాతమే ...

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.37 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 4.95 లక్షల టన్నులు మార్కెట్‌కు వస్తాయి. ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం 2.55 లక్షల టన్నులకు మాత్రమే పరిమితమైంది. అంటే మొత్తం ఉత్పత్తయ్యే దానిలో 46.3 శాతం మాత్రమే సేకరిస్తే మిగతాది ప్రైవేటు వారి దాయాదాక్షిణ్యాలపై రైతులు అమ్ముకోవాలి.

ప్రజాశక్తి కథనంపై అధికారులు స్పందన

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ధాన్యం సేకరణ ప్రక్రియపై పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ, సిబ్బంది, గోనె సంచుల సరఫరా, ఆర్‌బీకేలతో రైస్ మిల్లుల అనుసంధానం, సీఎంఆర్, రైస్ మిల్లుల బ్యాంకు గ్యారంటీలు, రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు అనుసరించవలసిన విధానాలపై సమీక్షించారు. "ధాన్యం కొనుగోలు ఎప్పుడు.?" అనే శీర్షికతో ప్రజాశక్తి ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం అన్ని ప్రాంతాల్లోనూ ధాన్యం కొను గోళ్లు ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లా డుతూ ఖరీఫ్ (2022-23) సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సోమవారం నుంచే ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభమైందని,రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఆర్‌బీకే స్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 263 ఆర్‌బీకేలలో అన్ని ఏర్పాట్లు చేసినటుట ఆమె తెలిపారు. ప్రధానంగా ఆర్‌బీకేలలో అవసరమైనన్ని గోనె సంచులను అందు బాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. కనీస మద్దతు ధర, ఆర్‌బీకేల ద్వారా చేపడుతున్న ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



గండేపల్లిలో అధికారులు నిలదీస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేందాన్ని మంగళవారం కాకినాడ ఆర్‌డిఒ బివి రమణ ప్రారంభించారు. ఈ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు. కస్టోడియన్, టెక్నికల్ సహాయకులను నియమించామన్నారు. వీరి ద్వారా కనీస మద్దతు ధర పొందవచ్చు అని ఏ విధమైన దళారులు మధ్య వర్తులును ఆశ్రయించవద్దని సూచిం చారు. అనంతరం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసం వెంకటేశ్వరరావు. తహాశీల్దార్ ఆర్‌వి వెంకటేశ్వరరావు. డిప్యూటీ తహాశీల్దార్ ఎంఎల్ కుమారి. రైతులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు. **గండేపల్లి** పాత పంచాయతీ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెద్దాపురం ఆర్‌డిఒ సీతారామరావు మంగళవారం ప్రారంభించారు. రైతులు మద్దతు ధర వస్తేనే అమ్మాలే తప్ప నష్టపోయి ధాన్యాన్ని అమ్మ వద్దని తెలిపారు. ఈ విషయంపై పలువురు రైతులు మాట్లాడుతూ ఒక నెల ముందుగానే ఈ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇది మెట్ట ప్రాంతం కావడం వల్ల బోర్లు ద్వారా పండించిన పంట కోతలు కోయడం తక్కువ ధరకు అమ్ముకోవలసి వచ్చిందన్నారు. ఇటీవల మిల్లర్లు స్ట్రైక్ చేసి ధాన్యాన్ని కొనకపోవడంతో కోసిన ధాన్యాన్ని ఎక్కడ వేయాలో తెలియక అవస్థలు పడుతున్నామన్నారు. వీలైతే మెట్ట ప్రాంతానికి పోలవరం కాలువ సాయిల్ బ్యాంక్ చదను చేసి కళ్ళాలుగా రైతులకు ఇచ్చినట్లయితే ధాన్యాన్ని ఆరబెట్టుకుని ప్రభుత్వానికి అమ్ముతామని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి పూర్తి అవగాహన లేకపోవడంతో రైతులకు సరైన సమాచారం సక్రంగా అందట్లేదని రైతులు అధికారులు దష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి చలగళ్ల దొరబాబు సర్పంచ్ లలిత తహాశీల్దార్ చిన్నారావు, ఎంపిడిఒ బికెఎస్‌వి రామన్, మండల అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ పోకల వెంకట్రావు, ఎ.ఒ సద్గురుమూర్తి, ఎంపిటిసి మద్దిపట్ల రామకష్ణ, ఉప్పలపాటి మమతా దేవి సాయి పాల్గొన్నారు. **కరప**మండల పెనుగుదురులో మంగళవారం జిల్లా పౌర సరఫరాల అధికారిని జి చాముండేశ్వరి రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన సాధారణ రకాలకు క్వింటాకు 2040 గ్రేడ్ ఏ రకం 2060 రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవి రాజేష్, డిటి కె అనిల్, కుమార్, ఎంఎస్‌ఓటి శ్రీనివాసరావు, వీఆర్వో ఆదినారాయణ, ఏ బి చైర్మన్ రామచంద్రమూర్తి, ఎఎబి మెంబర్ టి గోవిందు, అగ్రికల్చర్ అసిస్టెంట్ సిహెచ్ గౌతమి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలం కాండ్రకోట గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారీల బెడద నుండి రైతులను రక్షించేందుకు, వారు పండించిన ధాన్యానికి గిట్టు బాటు ధర కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు,వైస్ ప్రెసిడెంట్ జోకా నానాజీ, పిఏసిఎస్ చైర్మన్ పళ్ళ గంగారావు,పంచాయతీ కార్యదర్శి బషీర్, ఉద్యానవన శాఖ సహాయకుడు ఎం సత్తిబాబు, సొసైటీ సీఈవో ఎస్ అర్జున్, టెక్నికల్ అసిస్టెంట్ ఎం దేవి,గవరసాన రాజశేఖర్, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మండలం పెదబ్రహ్మదేవం గ్రామం రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను మంగళవారం కాకినాడ జిల్లా సివిల్ సప్లై జిల్లా మేనేజర్ డి పుష్పమణి ప్రారంభించారు. ధాన్యం శాంపిల్ సేకరించి సాధారణ రకానికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,040/-లు, గ్రేడు-ఎ రకానికి రూ.2,060/-లు ఇస్తారని, నాణ్యత ప్రమాణాలు పాటించి రైతులు ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను పొందాలని డిఎం పుష్పమణి సూచించారు. కార్యక్రమంలో ఎఒ పి పవిత్ర, తహాశీల్దార్ లక్ష్మీ నరసకుమారి ఎంపిటీసీ మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు మలకల వరహాలు, ఎఇఒ ఎంవి సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, అధికారులు, రైతులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బయో రెమిడేషన్ పరిశీలన



బయో రిమిడేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

మురికినీటిలోని ప్రమాదకర, హానికర వ్యర్థాల తీవ్రతను తగ్గించేందుకు కెమికల్స్‌తో కూడిన ద్రావణాన్ని వినియోగిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఇందుకు సంబంధించి డంపింగ్ యార్డు ప్రాంతంలో చేస్తున్న బయో రిమిడేషన్ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాల్వల్లోని మురికి నీటిలో బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్(బిఒడి), కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(సిఒడి) అధికంగా ఉంటాయన్నారు. ఈ నీటిని తాగే జీవరాసులకు ఎంతో హాని కలుగుతుందన్నారు. ఈ క్రమంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కాలువల్లోని నీటినిలో ఆమోదం పొందిన కెమికల్స్‌ను వాడడం వల్ల బిఒడి, సిఒడిల తీవ్రతను తగ్గించి సముద్రంలో కలిపే ప్రక్రియ చేస్తామన్నారు. పైగా ఆ నీటిని తాగ డానికి మినహా ఇతర అవసరాలకు కూడా వినియోగించుకునేలా శుద్ధి చేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఇందుకు సంబంధించిన ప్లాంట్‌ను రెవెన్యూ కాలనీ, చీడిలపొర, దుమ్ములపేట ఔట్‌లెట్ల వద్ద ఏర్పాటు చేస్తున్నా మన్నారు. దీనిపై ఆయన అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డిఈ మాధవి, కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

త్వరలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం

త్వరలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ చెప్పారు. మంగళవారం ఆయన కాకినాడ గాంధీనగర్ మార్కెట్‌ను సందర్శించారు. అక్కడి వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు. మార్కెట్ నుంచి వచ్చే కూరగాయల వ్యర్థాలను బయట ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని సూచించారు. ప్రజలు కూడా సహకరించి చెత్తను వేరువేరుగా విభజించి కార్మికులకు అందజేయాలని కమిషనర్ కోరారు.

అపార్ట్ మెంట్ల వద్ద పెద్ద డస్ట్ బిన్లు పెట్టుకోండి

అపార్ట్‌మెంట్ల వద్ద ప్రత్యేకంగా పెద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు సూచించారు. పదికిపైగా ప్లాట్లు ఉన్న అపార్ట్మెంట్లను గుర్తించి నెలాఖరు లోపుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఆయన పదో సర్కిల్ పరిధిలోని 33 వ డివిజన్ లచ్చిరాజు వారివీధి, మెయిన్ రోడ్డు, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంనతరం ఎడిసి మాట్లాడుతూ అపార్ట్మెంట్లలో ప్రతి ప్లాట్‌కు వెళ్లి చెత్త సేకరణ చేయడం కొంత సమస్యగా ఉన్నందున సెల్లార్ల వద్ద పెద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్లాట్ల నుంచి తీసుకువచ్చి సెల్లార్‌లోని పెద్ద డస్ట్‌బిన్‌లో వేయడం వల్ల పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణ సులభతర మవు తుందన్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అపార్ట్మెంట్ల అసోసియేషన్లు, నిర్వాహకులతో సమా వేశాలు ఏర్పాటుచేసి ప్రతిపాదనపై వివరించాలన్నారు. నెలాఖరు నాటికల్లా ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

ఆదివారం కూడా చెత్త సేకరణ

ఆదివారం కూడా పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణకు వస్తారని ఏ డి సి చెప్పారు. ఆదివారం పనిచేసే వారికి ప్రత్యా మ్నాయంగా వేరొక రోజు సెలవు ఇస్తున్నామన్నారు. ప్రజలంతా సహకరించి చెత్తను రోడ్లపై వేయ కుండా డస్ట్ బిన్‌లోనే వేయాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లింగ నిర్ధారణపై నిఘా

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో మాతా, శిశు మరణాలు, లింగ వివక్షతా పూరిత భ్రూణహత్యల నివారణ, చిన్నారులలో పోషణ, ఎదుగుదల లోపాల సవరణ అంశాలలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో వైద్య ఆరోగ్యం, ఐసిడిఎస్, పోలీస్ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కతికా శుక్లా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్ట అమలకు జిల్లాలో చేపట్టిన చర్యలను సమీక్షిస్తూ స్కానింగ్ సెంటర్లలో పిండ లింగ నిర్ధారణకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు దుర్వినియోగం కాకుండా గట్టి నిఘాను కొనసాగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆడశిశు జననాల సంఖ్య తక్కువగా నమోదైన ప్రాంతాలలో స్కానింగ్ సెంటర్లపై పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. గత రెండు మాసాల్లో జిల్లా తుని మండలం, కెపి.పురం, గండేపల్లి మండలం జడ్.రాగంపేట ప్రాంతాలలోని స్కానింగ్ సెంటర్లలో డివిజనల్ అధికారులు నిర్వహించిన 3 డెకాయ్ ఆపరేషన్లలో ఎటువంటి అక్రమాలు జరగడం లేదని గమనించామన్నారు. సమావేశంలో స్కానింగ్ సెంటర్లు క్రొత్తగా ఏర్పా టుకు, మెషీన్లు, సిబ్బంది మార్పులు కొరకు అనుమతులు కోరుతూ జిల్లా స్థాయి కమిటీ అందిన దరఖాస్తులను ఆయా సెంటర్ల సమగ్ర పరిశీలన జరిపి జారీ చేసేందుకు ఆమోదించారు. అలాగే డెకాయ్ ఆపరేషన్లు, కంప్యూటర్ రిపేర్ల అయ్యే ఖర్చులను జిల్లా స్థాయి కమిటీ ఆమోదించింది. అనంతరం గత సెప్టెంబర్ నెలలో జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులలో సంభవించిన 4 మాతా మరణాలకు కారణాలను జిల్లా స్థాయి ఆడిట్ కమిటీ సమీక్షించింది. ఈ నాలుగు కేసుల్లోను గర్భిణులు ఆకస్మికంగా తలెత్తిన తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగా మరణించినట్లు సంబంధిత ఆసుపత్రుల వైద్య అధికారులు తెలియజేయగా, వాటి కేస్ షీట్‌లను మరింత నిశితంగా విశ్లేషించి మరణాలకు కారణాలపై నివేదిక తనకు సమర్పించాలని, ఇటువంటి మరణాలు పునరా వృతం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. జిల్లాలో సగటున నెలకు 3 నుండి 4 మాతా మరణాలు నమోదవు తున్నాయని, వీటిని పూర్తిగా నివారించేందుకు గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ, పోషణ పై వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్ శాఖలు సమష్టి పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఆయా పిహెచ్‌సిల డాక్టర్లు తమ ప్రాంతంలోని గర్భిణల ఆరోగ్యాన్ని స్వయంగా పరిశీలిస్తూ, ప్రసవ సమయంలో ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి మాత వందన యోజన ద్వారా ప్రసూతి సహాయ మొత్తాల చెల్లింపులో జరుగుతున్న జాప్యం నివారణకు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి డిఒ లేఖ ద్వారా నివేదించాలని కలెక్టర్ సూచించారు. గత సెప్టెంబరు నెలలో జిల్లాలో మొత్తం 24 శిశు మరణాలు జరిగాయని, 5 ఏళ్ల లోపు పిల్లల్లో ఆరోగ్య పరమైన సమస్యల వల్ల జరిగిన మరణాలు, పోషక లోపాల వల్ల జరిగిన మరణాలను గుర్తించి వాటి నివారణకు చేపట్టవలసిన సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో వయసుకు తగ్గ ఎదుగు దల, ఎదుగుదలకు తగిన బరువు లేని పిల్లలను ఎన్.ఆర్.సి సెంటరు చేర్పించి, పోషణ లోపాలను సవరించాలని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.శాంతిప్రభ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలత, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ విష్ణువర్ధని, అడిషనల్ ఎస్‌పి బి.సత్యనారాయణ, అడిషనల్ డియంహెచ్‌ఓ డాక్టర్ కె.రమేష్, పబ్లిక్ ప్రసిక్యూటర్ ఆదిత్యకుమార్, జిజిహెచ్ పిడియాట్రిక్స్ హెచ్‌ఓడి డాక్టర్ ఎం.ఎస్.రాజు, గైనిక్ హెచ్‌ఓడి డాక్టర్ జి.శైలజ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అప్పలనాయుడు (ఉమా మనో వికాస కేంద్రం), పి.చక్రవర్తి (ఎన్ ఈ ఈ డి), ఎండి బీబీ సపూసా (ఎస్‌ఏఎస్) పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా



కలెక్టరేట్ వద్ద దర్నా చేస్తున్న టిడిపి శ్రేణులు

ధాన్యం కొనుగోలు కోసం ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లాలో ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, రైతులు ఆందోళనలో ఉన్నారని టిడిపి నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. టిడిపి అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ ఆధ్వర్యంలో రైతులు, టిడిపి నాయకులు ధర్నా చేసి కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పిఠాపురం నియోజకవర్గం రైతాంగానికి సుమారు 40 శాతం గత దాళ్వా సీజన్ సంభందించి ధాన్యం బకాయిలు, పెట్టుబడి డబ్బులు 6 పంటలకు సంబంధించి సుమారుగా 150 కోట్లు బకాయిలను తక్షణమే చెల్లిం చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరం కోతలు ప్రారంభం అయి సుమారు పది రోజులు కావస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొన్న దాఖలాలు కనపడలేదన్నారు. అలాగే రైస్ మిల్లర్స్‌కి రావాల్సిన 1800 కోట్లు ప్రభుత్వం ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వమే రైతుల ఇబ్బందులు అర్థం చేసుకొని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సందడిగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి, అన్నవరం

అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణ సందడిగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం దేవస్థానం అధికారులు సత్యదేవుని సతీ సమేతంగా ప్రత్యేకంగా అలంకరించిన సత్య రథంపై ఉంచి కొండపైన తూర్పు రాజగోపురం నుండి రత్నగిరి సత్యగిరి కొండచుట్టు వేలాదిమంది యాత్రికులతో కలిసి ప్రదక్షిణ నిర్వహించారు. దేవస్థానం అదికారులు దారి పొడవునా ఆల్పా హారం, పాలు, పండ్లు, తాగు నీరు పంపిణీ చేశారు. ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఇఒ ఎన్.వి ఎస్.ఎన్. మూర్తి, చైర్మన్ ఐ.వి.రోహిట్ సమక్షంలో నిర్వహించిన సత్యదేవుని గిరి ప్రదక్షిణ 12 కిలోమీటర్ల వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహించారు.


రత్నగిరి ఆలయం మూసివేత

చంద్ర గ్రహణం సందర్భంగా అన్నవరం సత్యదేవుని ఆలయాన్ని దేవస్థానం అధికారులు మూసివేశారు. మంగళవారం ఉదయం స్వామి వారి వ్రతాలు 8 గంటల వరకు,, సర్వ దర్శనాలు 10.30 గంటల వరకు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఇఒ. ఎన్.వి ఎస్.ఎన్.మూర్తి సమక్షంలో అధికారులు 11 గంటలకు ప్రధాన ఆలయం ద్వారాలు మూసివేశారు. చంద్రగ్రహణం ఆయిన తరువాత బుధవారం ఉదయం 6 గంటల నుండి యధావిధిగా దర్శనాలు కల్పిస్తామని దేవస్థానం పి.ఆర్.ఓ కొండలరావు తెలిపారు.



గిరి ప్రదక్షిణలో జన సందోహం

కార్టూ'నిజం'



మత్స్యకారుల సంక్షేమానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంగళవారం సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 10వ డివిజన్ దుమ్ములపేటలో పర్యటించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, కమిషనర్ కె.రమేష్, ఇతర అధికారులతో కలిసి ఎంఎల్ఎ ఇంటింటికి వెళ్ళి వైసిపి అధికారంలోకి వచ్చాక గత మూడేళ్లలో యేటా పదివేలు చొప్పున మత్స్యకార భరోసా అందిందన్నారు. మత్స్యకారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడే ఉన్న అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సుంకర విద్యాసాగర్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మండలంలోని ఉండూరులో మంగళవారం పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబుకు గ్రామ సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఉప సర్పంచి కొప్పిరెడ్డి రాధాకృష్ణల ఆధ్వర్యంలో దొరబాబు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్‌లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు



రెడ్ క్రాస్ చైర్మన్ రామారావు అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్రస్థాయిలో సేవలందిస్తున్న సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ జిల్లా పురస్కారాలను వరుసుగా జిల్లాకు రావడం అభినందనీయమని కలెక్టర్ కతిక శుక్లా అన్నారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్లో రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెడ్ క్రాస్ చేస్తున్న సేవలతో ప్రజల్లోకి వెళ్లి సేవలందించి మరింత గుర్తింపు తీసుకురావాలన్నారు. జిల్లా నుంచి అవార్డులను అందుకున్న జడ్‌పి సిఇఒ ఎన్.సత్యనారాయణ, కాకినాడ అర్బన్ తహాశీల్దార్ ఎస్.సతీష్‌ను, కలెక్టర్ అభినందించారు.


డిఆర్‌ఓ శ్రీధర్‌రెడ్డికి క్రీడల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు త్రినాథ్

11 నుంచి రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రెవెన్యూ ఉద్యోగులపై ఉన్న తీవ్ర ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఒక భాగమని గ్రహించి గుంటూరులో ఈ నెల 11,12,13 తేదీల్లో ఈ క్రీడా ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ పిలుపు నిచ్చారు. మంగళవారం 6వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను కలెక్టరేట్లో డిఆర్ఓ శ్రీధర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఉద్యోగులందరూ ఈ క్రీడల్లో పాల్గొంటారన్నారు. క్రీడలను, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ ఉద్యోగులందరినీ కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

నేటి నుంచి ఓటర్ కార్డుల సవరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓటరు కార్డు సవరణకు డిసెంబర్ 8వ తేదీ వరకు అవకాశం ఉందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ తెలిపారు. బుధవారం నుంచి నెల రోజులపాటు జరిగే ఈ ప్రక్రియలో ఓటర్లు ఏమైనా సవరణలు ఉంటే చేసుకోవచ్చునన్నారు. మంగళవారం సాయంత్రం స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఓటర్ల కార్డుల్లో సవరణ, ఆధార్ అనుసంధానంపై బూత్‌లెవెల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఈ నెల 19, 20, డిసెంబర్ 4వ తేదీలలో సవరణల కోసం ప్రత్యేక శిబిరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. బూత్‌లెవెల్ అధికారులు ఆధార్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ కోరారు. ఇప్పటి వరకు 67 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన శాతాన్ని కూడా వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, బూత్‌లెవెల్ అధికారులు పాల్గొన్నారు.


పేదవృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రమణయ్యపేట రాజీవ్ గాంధీ కళాశాల కాలువ గట్టు ప్రాంత వృద్ధులకు శ్రీవర్ధిని పుట్టినరోజు పురస్క రించుకుని భాగ్యలక్ష్మి, శంకర్ల సౌజన్యంతో దుప్పట్ల పంపిణీ చేశారు. శ్రీవర్ధిని రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, శ్రీ నగేష్, రాఘవరావు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామస్తుల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి-తాళ్లపూడి

రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా నిర్మాణం అవుతున్న గజ్జరం-గోపవరం రోడ్డు నిర్మాణంలో గ్రామస్తులు రోడ్డు పక్కనే గల ఆక్రమిత నిర్వాసితులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎపిఆర్‌డిసి చైర్మన్ కె.సుబ్బరాజు అభినందించారు. మంగళవారం మండలానికి వచ్చిన ఆయన వారితో మాట్లాడారు. గజ్జరం గోపవరం గ్రామాల మధ్య నిర్మితమవుతున్న ఈ రోడ్డు మార్జిన్‌లో నివసిస్తున్న 14 కుటుంబాల వారు ఉంటున్న స్థలాలను స్థలాలను ఖాళీ చేసి అందజేశారని, గ్రామ సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు తెలిపారు. ప్రభుత్వం తనకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని నివాసాలను పోగొట్టుకున్న కుటుంబాలకు అందజేస్తున్నానని అన్నారు. ఆ కుటుంబాల్లో అనాథ పేద వద్ధురాలు వి.సీతామహాలక్ష్మికి రూ.లక్ష అందజేశారు. మిగిలిన కుటుంబాలకు ఒక కుటుంబానికి రూ.పది వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వీరిలో గాయత్రి అనే లబ్ధిదారు తనకు వచ్చిన రూ.పది వేలను వృద్ధ మహిళకు అందజేయడంతోఆమె ఉదారతకు చలించిన చైర్మన్ తిరిగి చెల్లించే విధంగా రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని గాయత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపిటిసి చిన్నబ్బాయి, వైసిపి నాయకులు వల్లభని శ్రీహరి, కాకర్ల చంద్రశేఖర్, గన్నిన రత్నాజీ, పంచాయతీ కార్యదర్శి హేమంతి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సింగవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - సీతానగరం

మంగళవారం సింగవరంలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ సంగన చినపోశియ్య శిబిరాన్ని ప్రారంభించారు. 73 మంది రోగులను పరీక్షించారు. డాక్టర్ ఎన్.రాజు మాట్లాడుతూ గర్భిణులు, బిపి, సుగర్ ఉన్న రోగులను పరీక్షించి వారికి తగిన మందులు ఇచ్చినట్టు చెప్పారు. ఈ ఫ్యామిలీ కాన్సెప్ట్‌లో రాలేని వారు ఎవరైనా అంటే వాళ్ల ఇంటి వద్దకు వెళ్లి వారిని పరీక్షించి వారికి కూడా తగిన మందులు ఇచ్చినట్టు చెప్పారు. స్థానిక ఎంపిపి స్కూల్, హైస్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యం పట్ల సూచనలు సలహాలు ఇచ్చినట్టు చెప్పారు. డెంగ్యూ, మలేరియా రోగులను పరీక్షించి వారికి తగిన మందులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశ వర్కర్లు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం విద్యార్థినికి పురస్కారం

ప్రజాశక్తి - సీతానగరం

సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్రస్థాయిల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సీతానగరం ప్రభుత్వ కళాశాల విద్యార్థిని దూళ్ల వెంకట ప్రసన్న జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. సీతానగరం శ్రీ సత్య సాయి సేవాసమితి సబ్ జోన్ కన్వీనర్ సత్యసాయి బాబా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి - విశిష్టత అనే అంశంపై పోటీలు జరిగాయి. గెలుపొందిన విద్యార్థులకు రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. డిఇఒ ఎస్.అబ్రహాం పాఠశాల, కళాశాల, జిల్లా స్థాయి విజేతలకు మెమెంటోలు, ప్రశంశా పత్రాలు అందజేశారని తెలిపారు.

'జగనన్న పాల వెల్లువ'పై సమీక్ష

ప్రజాశక్తి-గోపాలపురం

దళారుల చేతిలో మోసపోకుండా పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా రాష్ట్రంలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పశుసంవర్థక శాఖ జెడి డాక్టర్ సత్య గోవింద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువపై మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య గోవింద్ మాట్లాడుతూ. ఈ నెల 21వ తేదీ నాటికి అమూల్ కంపెనీ ద్వారా పాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవిని కోరారు. గ్రామాల్లో ఇందుక సంబంధించి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. రైతులు పాడిద్వారా నష్టపోకుండా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు.

మతసామరస్య రక్షణలో కమ్యూనిస్టులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మతసామరస్యాన్ని కాపాడడంలో కమ్యూనిస్టులు ముందుంటారని మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ అన్నారు. సిపిఎం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం స్థానిక వైఎంవిఎ హాల్లో ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎవి.నాగేశ్వరరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా ఎంవిఎస్.శర్మ పాఠాన్ని బోధించారు. స్వాతంత్రోద్యమంలో మతాలు, కులాలు, ప్రాంతాల బేధం లేకుండా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని రాజకీయంగా కొన్ని శక్తులు సొమ్ము చేసుకుంటున్నాయని అన్నారు. మతతత్వ శక్తులు, కార్పొరేట్ శక్తులు ఒకటై ప్రజలను ముంచుతున్నాయన్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి అనవసర విషయాలను తెరపైకి తెచ్చి పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. స్వాతంత్రోద్యమం ప్రజలకు ఇచ్చిన హక్కులు నేడు హరించేస్తున్నారని, సంక్షేమ రాజ్యం స్థానంలో ప్రతిదీ ప్రయివేటుపరం అవుతోందన్నారు. ఈ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, ఎస్. ఎస్ఎస్.మూర్తి, టి.సావిత్రి, పి.వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.తులసి, బి.పవన్, బి.రాజులోవ, కెఎస్‌వి.రామచంద్ర రావు, రాజా, 26 జిల్లాల జిల్లా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న శర్మ


ఒకే కాన్పు లో జన్మించిన కవలలు

ఒకే కాన్పులో ముగ్గురి జననం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్:

కాకినాడ రమ్య హాస్పిటల్‌లో డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొత్తలంక గ్రామానికి చెందిన కరుణ కుమారి ఒకే కాన్పులో ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్లకు జన్మనిచ్చింది. అదేవిధంగా కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి అనుసూరి మంజూరుకు చెందిన సుధారాణికి ఒక ఆడ, మగ కవల పిల్లలు, కాకినాడకు చెందిన రమాదేవికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించినట్లు డాక్టర్ ప్రభావతి తెలిపారు. ఒకే రోజు ఈ హాస్పిటల్‌లో ముగ్గురు గర్భిణులు కవలలకు జన్మనివ్వడం ఇదే మొదటి సారి అని డాక్టర్ ప్రభావతి తెలిపారు.

స్కేటింగ్ విజేతలకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కాకినాడ విద్యార్థులను కలెక్టర్ కృతికా శుక్లా, తూర్పుగోదావరి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఛైర్మన్ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్ కతికా శుక్లా, ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా వారు స్కేటింగ్ అసోసియేషన్, కోచ్‌లను అభినందించారు. వివేకానంద పార్కులోని స్కేటింగ్ రింక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి, అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో కాకినాడ నుంచి 35 మంది పాల్గొని 51 పతకాలు సాధించినట్లు కోచ్ వి.ఈశ్వర్ కుమార్ తెలిపారు. డిసెంబర్‌లో బెంగళూరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు 14 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి దొరస్వామి, అసోసియేషన్ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


రోలర్ స్కేటింగ్ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా

కాకినాడ ఎస్‌డిపిఒగా మురళీకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ ట్రాఫిక్ డిఎస్పీగా పని చేస్తున్న పి.మురళీకృష్ణా రెడ్డిని కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర హెూం శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎస్‌పిడిఒగా పని చేస్తున్న భీమారావు మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ముంపు నివారణపై శాశ్వత చర్యలకు డిమాండ్

- కౌలు రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

గోదావరికి వరదలు వచ్చిన సమయంలో ముందు జాగ్రత్తగా పలుచోట్ల స్లూయిజ్ గేట్లు మూయకపోవడం వల్ల మండల రైతాంగం పంట పొలాలు ముంపు బారిన పడి నష్టపోతున్నారని ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని సోమవారం తాళ్లరేవులో జరిగిన జిల్లా స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం ఇచ్చినట్టు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వళ్ళు రాజుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో ఉన్న మురుగు కాలవలు, పంట కాలువలు బాగు చేయాలని, మురుగు కాలవల్లో వాటర్ గోదావరిలో దిగే చోట గేట్లు నిర్మించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో తాళ్ళరేవు ఎండిఓ ఆఫీస్ వద్ద నిర్వహించిన స్పందనలో రాజుబాబు అధికారులకు వివరించామన్నారు. నీలపల్లి, జార్జిపేట గ్రామాలలో పందులు పంటలను నాశనం చేయడాని అరికట్టాలని ఇంజరం, గ్రాంటు గ్రామాలకు సంబంధించిన పొలాల మురుగనీరు గోదావరిలో దిగే చోట గేట్లు వేయించాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులందరినీ ఈ క్రాప్‌లో చేర్చాలని కౌలు రైతుల, చిన్న సన్న కారు రైతు మిత్ర గ్రూపుల రుణాలు మాఫీ చేయాలని, భూమి నిబంధన సడలించి కులంతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతుకు రైతు భరోసా వర్తింప చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో భాగంగా సొంత భూమిలేని కౌలు రైతుకు 50 సెంట్లు భూమి ఇవ్వాలని ప్రభుత్వ రాయితీలు అన్ని కౌలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని, మురుగు కాలువలు పంట కాలువలు వెంటనే బాగు చేయా లని కౌలు కార్డు ఉన్నా లేకపోయినా ధాన్యం అమ్ముకునే విధంగా అమ్మిన ధాన్యానికి 21 రోజుల్లో డబ్బులు చెల్లించాలని ఆ డబ్బులు సాగురైతే అకౌంట్లో వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకు, జడ్‌పి సీ.ఈ.వో. సత్యనారాయణకు వినతి పత్రాలు అందజేశారు.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నీలపల్లి రైతులు వాసంశెట్టి సత్తిబాబు, ఎం ప్రభాకర్, రావు పి.ఏడుకొండలు, కౌలు రైతులు పాల్గొన్నారు.


కౌలు రైతులతో వళ్ళు రాజుబాబు

సెలూన్ రంగంలోకి రిలయన్స్ ప్రవేశాన్ని నిలువరించాలి

ప్రజాశక్తి - కాకినాడ


క్షౌరవృత్తిలోకి (సెలూన్) బడా కంపెనీ సంస్థ రిలయన్స్ రాకుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవాలని ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది. మంగళవారం కాకినాడలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమాఖ్య సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి గోపాలకృష్ణ మాటాడుతూ క్షౌరవృత్తిలోకి రిలయన్స్ సంస్థ రావడం అంటే ఆ వృత్తిదారుల జీవనోపాధికి నష్టం చేయడమేనన్నారు.

వృత్తిదారుడు చాలా కష్టాలు పడుతున్నాడని పూట గడవక ఆత్మహత్య చేసుకున్న సంగతిని సుందరపల్లి గుర్తు చేశారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులవృత్తులలో కార్పొరేట్లు ప్రవేశించకుండా అడ్డుకోవా లన్నారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారుడు లంక అప్పారావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షుడు కోట ఉమా, వీరబాబు, మాణిక్యం, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు పూర్తి పారదర్శకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పౌర సరఫరాలశాఖ విసి అండ్ ఎండి జి.వీరపాండ్యన్ స్పష్టం చేశారు. గన్నీ బ్యాగులు, బ్యాంకు గ్యారంటీ, రవాణా, రైతులకు ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలుపై అవగాహన కోసం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, కలెక్టర్ మాధవీలత, జెసి శ్రీధర్ పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఖరీఫ్ 2022-23 ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్‌ను అమరావతి నుంచి జిల్లా కలెక్టర్‌లతో వీర పాండ్యన్ విసి నిర్వహించారు. రైతులు స్వంతంగా వాహనాలు సమకూర్చుకుంటే వారికి ధాన్యం సరుకు రవాణా విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇస్తామని చెప్పారు. పౌర సరఫరాల కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్ సమీక్ష నిర్వహిస్తూ, ధాన్యం సేకరణకు సంబంధించి పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆచరణలో పెట్టడానికి చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా కోర్ సమస్యల విషయంలో మరింత దృష్టి పెట్టాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు సరిపడే గన్నీ బ్యాగులు ప్రతి ఆర్‌బికెకు వచ్చే ధాన్యానికి అనుసంధానంగా సిద్ధం చేసుకోవాలన్నారు. కస్టమైజ్డ్ మిల్లింగ్ రైస్, బ్యాంకు గ్యారంటీ, లేబర్ (హమాలీస్), రవాణా, వే బ్రిడ్జెస్, పరికరములు, సిబ్బంది, రైతులకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రక్రియపై అవగాహన కల్పించడం కూడా బాధ్యతగా చేపట్టాలన్నారు. హమాలీ ఛార్జీలు, సరుకు రవాణా ఛార్జీలు ధరలను హేతుబద్ధంగా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ, ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలో చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ సిహెచ్. శ్రీధర్ వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, డిఎస్ఒ పి.ప్రసాద రావు, డిఎం (సిఎస్) ఆర్.తనూజా, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, సహాయ మేనేజర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్, కలెక్టర్, జెసి

పీస్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్


స్థానిక గైగోలుపాడు జడ్‌పి పాఠశాలలో ప్రపంచ శాంతికి పీస్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు 11 నుంచి 13 సంవత్సరాల విద్యార్థిని విద్యార్థులకు లీడ్ విత్ కంపాషన్ అనే థీమ్‌తో లయన్స్ క్లబ్ కాకినాడ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలుగా ఏ.పి. ఎస్.పి.ఇంగ్లీష్ మీడియం పాఠశాల 6వ తరగతి విద్యార్థిని యు.హంసిక ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీకి ఎంపికైంది. విజేత లకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా కాళ్ళూరి వంశీమోహన్, వేదుల శ్రీకష్ణఫణీంద్ర వ్యవహరించారు. ప్రోగ్రాం చైర్మన్ రవి శంకర్ పట్నాయక్ మాట్లాడుతూ లీడ్ విత్ ది కంపాషన్ అనే థీమ్ ఉప యోగించి విద్యార్థులు వేసిన పోస్టర్స్ చాలా అద్భుత మైన విగా ఉన్నాయన్నారు. క్లబ్ కార్యదర్శి సుమా పట్నాయక్ మాట్లాడుతూ ఇక్కడ ప్రథమ స్థానం పొందిన వారి పోస్టర్స్ జిల్లా పోటీలకు పంపిస్తా మని, తదుపరి అక్కడ కూడా ఎంపి కయితే మల్టిపుల్ స్థాయి, అక్కడ కూడా ఎంపిక యితే ఇంటర్నే షనల్ స్థాయి పోటీకి అమెరికా పంపుతా రని అక్కడ విజేతలకు గ్రాండ్ మని ప్రైజ్ ఉంటుందన్నారు. జిల్లా మొదటి గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్షురాలు వి.బాలా త్రిపురా సుందరి, క్లబ్ పీస్ పోస్టర్ కో-చైర్మన్, జిల్లా చైర్మన్ ప్రభుదాస్, ఉపా ధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, కొవ్వూరి మునిరెడ్డి క్లబ్ కార్యదర్శి సుమాపట్నాయక్, పూర్వపు అధ్యక్షులు ఏ.వి. డి.మెంటారావు, జోన్ చైర్మన్ సిహెచ్ మాధవ రావు, జెమ్స్ క్లబ్ కార్యదర్శి నరసింహామూర్తి పాల్గొన్నారు.


విజేతలతో లయన్స్ సభ్యులు, ఉపాధ్యాయులు

అచ్యుతరామయ్య ప్యానెల్ విజయం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

అక్టోబరు 31వ తేదీన జరిగిన ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కోళ్ల అచ్యుతరామయ్య ప్యానెల్ ఘనవిజయం సాధించింది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కోళ్ళ అచ్యుతరామయ్య, ప్యానెల్ సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసరావు, అందనాపల్లి సత్యనారాయణ, కురుమిల్లి శాంతి స్వరూప్, కటారి శ్రీనివాస్ కన్నా, నారపురెడ్డి సన్యాసిరావు, జామి వెంకటరమణమూర్తి, గేడి పోతురాజు, పాడిపిరెడ్డి శివశ్రీనివాసరావు, పంచకట్ల శివప్రసాద్, దాది సత్యనారాయణ, గుత్తుల భాస్కరరావు విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా కోళ్ల అచ్యుతరామయ్య మాట్లాడుతూ ఈ విజయం ఖాతాదారులు నమ్మకం, గత 20 ఏళ్లుగా ఎటువంటి అవినీతికి తావులేకుండా సేవలందించడమే ఈ విజయానికి కారణమని చెప్పారు. ఉన్నతాధికారుల అనుమతితో క్రొత్తబ్రాంచీల ఏర్పాటుకు ప్రయత్నిస్తానని, తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



నేరాలు ఘోరాలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - సీతానగరం

అప్పుల బాధ తాళలేక కూనవరం గ్రామానికి చెందిన రైతు మంగళవారం పురుగుల మందు తాగాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నందరి నూకరాజు కూనవరం గ్రామంలో పదెకరాల పామాయిల్ తోటను లీజుకు తీసుకుని, పెట్టుబడుల నిమిత్తం రూ.పది లక్షల వరకు అప్పులు చేశాడు. పామాయిల్ ధరలు పడిపోవడంతో మనస్తాపం చెందాడు. ఉదయం 9 గంటలకు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి, వైద్యం అందిస్తున్నారు. నూకరాజు పరిస్థితి విషయంగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు.

మద్యం, సారా కేసుల్లో 43 మంది అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నాలుగు రోజులుగా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు, ఎస్‌ఇబి అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్, ఎస్‌ఇబి అసిస్టెంట్ కమిషనర్ ఎం.జయరాజు పర్యవేక్షణలో మద్యం అక్రమ అమ్మకాలు, సారా తయారీ, అమ్మకందార్లపై దాడులు నిర్వహించి, 43 మందిని అరెస్టు చేశామని ఎస్‌ఇబి ఎస్‌ఐ తెలిపారు. కాకినాడ సౌత్, నార్త్, పిఠాపురం, తాళ్లరేవు, ప్రత్తిపాడు, పెద్దాపురం, తుని పరిధిలో జరిపిన దాడుల్లో 64 కేసులు చేశామని తెలిపారు. 266 లీటర్ల సారా, 3650 లీటర్ల బెల్లపు ఊటను, నాన్ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ 540 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాకినాడ జిల్లాలో వివిధ స్టేషన్లో పరిధిలో పరారీలో ఉన్న వివిధ కేసుల్లోని నేరస్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.